క్లుప్తంగా

రుణమాఫీ చేయాలి

నంగునూరు(సిద్దిపేట): అధికారంలోకి రాగానే లక్ష రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా పూర్తిస్థాయిలో మాఫీ చేయలేదని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. బుధవారం నంగునూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సమావేశాల్లో పలువురు మంత్రులు వారం లోపు రూ. లక్ష రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి రైతులను మభ్య పెట్టారన్నారు. వెంటనే ప్రతి రైతుకు పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): పండగల విశిష్టత, సంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వాసర యాదమల్లు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని మగ్దుంపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, నారాయణ, హర్షద్, విజయలక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

పంచాయతీ నిధులపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తామని డీఎల్‌పీఓ వేదావతి అన్నారు. మండలంలోని మునిగడప పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఇటీవల గ్రామ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం డీఎల్‌పీఓ వేదావతి పంచాయతీ రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలోని పల్లె పార్కు, నర్సరీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ నిధులపై విచారణ చేయనున్నట్టు తెలిపారు. రికార్డులను పరిశీలించి నిధుల దుర్వినియోగం జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతిలోనే పిల్లల భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుబ్బాక: పిల్లల భవిష్యత్ తల్లిదండ్రులు చేతిలోనే ఉందని, బడిఈడు పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులు, సంరక్షకులు సహకరించాలని సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. రాయపోల్ మండలంలోని సయ్యద్ నగర్‌లో బుధవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో చదువు ఎంతో ముఖ్యమని, అభివృద్ధి చెందాలంటే వంద శాతం అక్షరాస్యత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సవ్వ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ పరిశీలన



లైబ్రరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తదితరులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని 7వ వార్డులో గల లైబ్రరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళితో కలిసి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా లైబ్రరీలో చేపట్టాల్సిన వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు కూరాకుల శ్రీను, మామిడి విద్యారాణి శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, విజయలక్ష్మీ, నాయకులు నర్సింగరావు, పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఫిబ్రవరి 5వ తేదీన మండల కేంద్రంలోని చౌడు తండాలో నిర్వహించనున్న శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తిరుపతినాయక్ అన్నారు. ఈసందర్భంగా బుధవారం హన్మకొండలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నివాసంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించినట్టు తెలిపారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



నూతన బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో రూ. 7.60 లక్షల సొంత నిధులతో నిర్మించిన రెండు బస్ షెల్టర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచడానికి కృషి చేస్తానన్నారు. ధర్మాజీపేటకు ప్రతీ రోజు ఒకే బస్సు వస్తుందని.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. వార్డులో మంచినీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని మహిళలు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే వార్డులో బాలవికాస నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లారెడ్డి, నాయకులు బాలేశ్‌గౌడ్, రాజు, సుభాశ్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



మిరుదొడ్డి: భోగి మంట చుట్టూ విద్యార్థుల ఆటాపాట



గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

గజ్వేల్‌రూరల్/మిరుదొడ్డి(దుబ్బాక): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యాసంస్థల్లో ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు రంగవల్లులు వేయగా.. ప్రజ్ఞాపూర్‌లోని సేయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోనూ సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత ఆధ్వర్యంలో టీచర్లు వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భోగి మంటలు వేసి ఆడి పాడారు. నేడు మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మోడల్ ప్రిన్సిపాల్ భారతీ దేవి తెలిపారు.

విజయం వైపు అడుగులు వేయాలి



క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ వీరప్రసాద్

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని గజ్వేల్ సీఐ వీరప్రసాద్ సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12 జాతీయ యూత్ డేను పురస్కరించుకొని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని క్రీడాకారులకు రెండో రోజు గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐవోసీ)లోని ×గడా× కార్యాలయ హాల్‌తో పాటు ఐవోసీ పక్కనగల మైదానంలో చెస్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఓటమితో నిరుత్సాహానికి గురికావద్దని, గెలుపుకు మరో అవకాశంగా భావించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు ఎలియాస్‌రావు, రాజిరెడ్డి, గజ్వేల్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మల్లన్న బండపై వన బోనాల నైవేద్యం



నైవేద్యాన్ని సమర్పిస్తున్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి, జంగపల్లి శివారులో ప్రకృతి సహజ సిద్ధంగా వెలసిన మల్లన్న బండపై బుధవారం భక్తులు స్వామి వారికి వన బోనాల నైవేద్యం సమర్పించారు. పచ్చగూరల వంటకాలతో తయారు చేసిన నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. కాగా బండపై వెలసిన మల్లిఖార్జున స్వామి, అభయాంజనేయ స్వామి, గోపాల స్వామి, నాగ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టు గుండాన్ని సందర్శించిన అనంతరం బండపై సామి వారి సన్నిధిలో భక్తులు సకుటుంబ సమేతంగా వన భోజనాలు చేసి తరించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రణం జ్యోతి

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని జెడ్పీటీసీ రణం జ్యోతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిరుమలాపూర్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నిధులతో ఎస్సీ, బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిధులకు సహకరించిన మంత్రి హరీశ్‌రావుకు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, సర్పంచ్ గడ్డ మీది భాగ్య ఎల్లం, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్ కోరారు. మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన పెర్క మల్లేశానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, ఉపసర్పంచ్ దిలీప్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు మధు, బాబు, కిరణ్, నాగరాజు, నితిన్, సాయిలు, కృష్ణ, మల్లయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

గజ్వేల్‌రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన అంశాలపై టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో మండలశాఖ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు సుధాకర్, వెంకటకిరణ్, ప్రభావతి, మండల ప్రధాన కార్యదర్శి సక్రియ మాట్లాడారు. ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యపానాన్ని నిషేధించాలి



మాట్లాడుతున్న కొండ ప్రశాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రవ్యాప్తంగా మద్యపానాన్ని నిషేధించాలని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు కొండ ప్రశాంత్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు, మద్యం దుకాణాలు విచ్చలవిడిగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని మద్యపానాన్ని నివారించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, శేఖర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు లాల్ బహదూర్ శాస్త్రీ



ఎల్‌బీ శాస్త్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: లాల్ బహదూర్ శాస్త్రీ చిరస్మరణీయుడని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. శాస్త్రీ రైల్వే మంత్రిగా కొనసాగిన సమయంలో రైలు ప్రమాదం జరిగితే నైతిక బాధ్యత వహించి తన మంత్రి పదవికి రాజీనామా చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు, మాజీ ఎంపీటీసీ హసన్, కౌన్సిలర్ శ్రీనివాస్, వల్లపు రాజు, పున్న సది లావణ్య, బీక్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నట్టు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని రేగులపల్లెలో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. అనంతరం బెజ్జంకిలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, జెల్ల ఐలయ్య, సంజీవరెడ్డి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు పూల మొక్కను అందజేస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కుందనవానిపల్లి, గండిపల్లి గ్రామాల పరిధిలోని పలు గిరిజన తండాల బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం హన్మకొండలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలు నాయక్, ఉప సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మాలోతు నర్సింహానాయక్ ఘనంగా సన్మానించారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు గిరిజనులు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని కొనియాడారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్లలో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ రూ. లక్షా యాభై వేల రూపాయలు అందించినట్టు సర్పంచ్ గాజుల రమేశ్ తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేను వారి నివాసంలో కలిసి ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించే పెద్దమ్మ తల్లి జాతరకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈగ మల్లయ్య, బైరి సంపత్, పోలవేని బాబు, శ్రీకాంత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



చిన్నకోడూరు(సిద్దిపేట): రైతు తయారు చేస్తున్న పీఎస్‌బీని పరిశీలిస్తున్న ఏడీఏ పద్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో అధిక దిగుబడి సాధించేందుకు యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు పశువుల పేడ వంటివి వాడాలని ఏడీఏ పద్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గోనెపల్లిలో జంగిటి మల్లయ్య అనే రైతు క్షేత్రాన్ని సందర్శించి భాస్వరం ఎరువుల వినియోగం తగ్గించుకోవడానికి పీఎస్‌బీ తయారు చేసే విధానంపై క్షేత్ర స్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ జయంత్, ఏఈఓ శివ, రైతులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): భూమిలోని భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందించేందుకు పీఎస్‌బీ జీవ ఎరువు దోహదపడుతుందని వర్గల్ మండల వ్యవసాయాధికారిణి శేషశయన అన్నారు. బుధవారం జబ్బాపూర్, గౌరారంలో జీవ ఎరువుల ప్రాధాన్యత, వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమిలో నిల్వ ఉన్న భాస్వరాన్ని కరిగించేందుకు ఒక లీటర్ పీఎస్‌బీ జీవ ఎరువును బాగా మాగిన 50 కిలోల పశువుల ఎరువులో కలిపి ఎకరం పొలంలో చల్లాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రఘువీరారెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారని.. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, అరవింద్, మహేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

వైభవంగా గోదా కల్యాణం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్వామివారికి క్షీరాన్నం నివేదించిన దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని స్థానిక గణేశ్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చిలకమర్రి వెంకట రమణా చార్యుల ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం తిరుప్పావై సేవాకాలం, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం క్షీరాన్నం ప్రసాదం స్వామి వారికి నివేదన చేశారు.

13 నుంచి గోదా రంగనాయక స్వామి వేడుకలు

దుబ్బాకరూరల్: మండలంలోని శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని శ్రీరాధ, రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 13, 14న కల్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు శేష భట్టార్ శ్రీనివాసచార్య తెలిపారు.

పోషకాహారం అందించాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించాలని ఎంపీడీఓ కుమారస్వామి అన్నారు. బుధవారం పోతారం(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయలతో పాటు కోడి గుడ్డును విద్యార్థులకు అందజేయాలని సూచించారు. అనంతరం మన ఊరు– మన బడిలో నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. వీరి వెంట హెచ్ఎం శంకర్ నాయక్, కార్యదర్శి ఎల్లయ్య, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఓబన్న సేవలు మరువలేనివి**

సిద్దిపేటకమాన్: ఒడ్డె ఓబన్న వంటి మహనీయుల పోరాటంతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని వడ్డెర సంఘం నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోదుడు ఓబన్న జయంతిని పురస్కరించుకుని వడ్డెర సంఘం నాయకులు సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి, మల్లేశం, శ్రీనివాస్, సంపత్, సుధాకర్ పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా బుధవారం ముస్తాబాద్ చౌరస్తాలో తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రవీణ్, శేఖర్, రవి, ఎల్లయ్య, మల్లేశం, నాగరాజు, పవన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

◆ **వైద్యుడికి సన్మానం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యుడు సత్యప్రకాశ్‌ను బుధవారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, కరుణాకర్, పరమేశ్వర్, రవి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన తెడ్డు శివయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ. 60 వేలు మంజూరయ్యాయి. బుధవారం ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్ ప్రసన్న సుధాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట**

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతి శ్యాంమనోహర్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆమె మాట్లాడారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 18 నుంచి రెండో విడత కంటివెలుగును విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

◆ **పరామర్శ**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంతేన బాలయ్య భార్య ఇటీవల మరణించగా అయన కుటుంబాన్ని మాజీ ఆఫ్కాబ్ చైర్మన్ దేవిశెట్టి శ్రీనివాసరావు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అయనతో పాటు బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, దామోదర్, తదితరులు ఉన్నారు.

◆ **ఆర్థికసాయం అందజేత**

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలో మృతిచెందిన బైండ్ల బాల నర్సయ్య కుటుంబాన్ని సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎంపీటీసీ భూములగౌడ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మల్లం ఐలయ్య, నాయకులు కోల రవీందర్, సంపత్, ఇండ్ల కనుకయ్య బుధవారం పరామర్శించి ఓదార్చి ఆర్థిక సహాయాలను అందజేశారు.

◆ **లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం**

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మనోస్థైర్యం నింపాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు మతిన్, సభ్యులు సంజయ్‌గుప్త, ఫణిధర్, నాయకులు పాల్గొన్నారు.

◆ **'స్వప్రయోజనాల కోసమే ఆరోపణలు'**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో కల్తీ నూనె విక్రయిస్తున్నారని ఇటీవల కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని కిరాణా మర్చట్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజుగం బాలకిష్టయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు వ్యక్తులు వారి స్వప్రయోజనాల కోసం వ్యాపారులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

◆ **పాఠశాలల అభివృద్ధికి కృషి**

మర్కూక్(గజ్వేల్): పాఠశాలల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు పాఠశాలల అభివృద్ధికి తమ నిధులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, ఉపాధ్యాయులు స్వప్న, రాజు, గణేష్, సంతోష్ పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని బీజేపీ మండలాధ్యక్షుడు గొల్లపెల్లి వీరాచారి ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా జంగపల్లి శ్రీనివాస్, మడక రవికుమార్, కార్యదర్శులుగా చొక్కం గణేశ్, కాశబోయిన సుమన్, బసిరెడ్డి రాకేష్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎడల హరికృష్ణ, ఓడీసీ మోర్చా మండలాధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శులుగా గొర్ల రమేశ్, కందారపు సతీశ్ ఎన్నికైనట్లు వీరాచారి పేర్కొన్నారు.

◆ **ఆయిల్ పామ్‌తో లాభాలు**

మర్కూక్(గజ్వేల్): సంప్రదాయ నూనె గింజల పంటల కన్నా ఆయిల్ పామ్ పంటలే మేలని ఏఓ నాగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను ఏఈఓల దగ్గర పంట నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రజనీకాంత్, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.